
## మహారుద్రాభిషేకం

— పూర్ణిమ మాగంటి

నవ్వుకున్న ఆ నవ్వో!
ఆ నవ్వులన్నీ కోసుకొచ్చానయ్యా!
ఇటు నవ్వులు. అటు కన్నీళ్ళు!
సంతలో గొడ్లమ్మబోయిన కొడుకు రౌడీ తగాదాల్లో ఇరుక్కోగా డబ్బు దోచుకుని కొడుకుని హతమార్చి కాలవలో పారేశారని విన్న క్షణం నించి సూరమ్మ కన్నీటికి అడ్డం వున్నదా? ఏ ఓదార్పు ఆ తల్లికి తిరిగి కొడుకు నివ్వగలదు?
లంకకు గొడ్లు తోలుకుపోయిన భర్త వరద ముంపుకు బలైపోగా బొట్టు మీద బొట్టు మెత్తుకున్నదేగాని ఆ ఇల్లాలు చూపు లంక మీంచి తిప్పిందా?
కళ్ళు ధారలవటం మానాయా?
తాత తండ్రులు కట్టిన ఇల్లు, పెళ్ళి పేరంటాలు జరిగిన ఇల్లు, పాపలుయ్యాల లూగిన ఇల్లు, అప్పు కింద తాకట్టైపోగా ఇల్లు విడిచిపోతున్న పంతులుగారు ఇంటి బయటకొచ్చి ఒక్కసారి ఇంటివైపు చూసినప్పుడు జారిన అశ్రుకణమో! మళ్ళీ ఆ గడపకి పసుపు రాసుకునే యోగ్యత లేదని పంతులుగారి భార్య గడపకి పసుపురాసి బొట్టుపెట్టి మొక్కుతున్నప్పుడు ఆమె కన్నీటికి చెరిగిన కుంకుమ రేఖలో,
ఏటి కేడాదీ భార్యా పిల్లలతో సహా ఆ పొలంలో పనిచేసి, రక్తం ధారపోసి పంటలు పండిస్తే, ఉన్నట్టుండి ఒక్కరాత్రి పంటంతా తుఫాను మింగేస్తే, గట్టునున్న రైతులం, తల్లీ! ఇదేనా నాయం! పిల్ల పెళ్ళి చేద్దామనుకున్నానే! ఇంటిదానికి కడియాలు కొందామనుకున్నానే! పెళ్ళీ లేదు కడియాలు లేవు.ఆఖరికి అన్నం కూడా లేకుండా చేశావా అమ్మా'' అంటుంటే
ఆ రైతు కళ్ళంట రాలిన కన్నీళ్ళకు భూమి బద్దలవదో!
ఆ నవ్వుల్ని, ఆ కన్నీళ్ళని కలబోసి తెచ్చాను తండ్రీ!
ఆ నవ్వులు నీవు విన్నవే!
ఆ కన్నీళ్ళు నీవు చూసినవే!
ఆ రెంటినీ కలిపి నా రెండు చేతులా నీ కర్పిద్దామని వచ్చానయ్యా! తెచ్చానయ్యా నూటొక్క బిందె వాసెన గట్టి! మోసుకుంటూ వచ్చానయ్యా దూరదూరాల నించి? అగాధాలు తవ్వి!, అంతరంగాలు తొలచి ఆకాశ గంగని, పాతాళగంగని కలబోసి ఒకేజాలుగా మళ్ళించి, స్వచ్ఛంగా నా గుండె పంటగా ప్రవహింప చేశానయ్యా!
లే తండ్రీ! లే!
తలార తనివితీర స్నానమాడు!
స్నానమాడి
శాంతించు నరుడా!
దీవించు హరుడా!
హరహర మహాదేవ!
నరహర మహాదేవ!

## నా వెనక ఎవరో...



సత్యం శంకరమంచి

నేనొక్కణ్ణే నడుస్తున్నాను.

ఒంటరిగా, నిశ్శబ్దంగా నడుస్తున్నాను. దూరంగా కనిపించే ఇళ్ళ కప్పులు, ఆ పైన కనిపించే ఆకాశంలోకి చూస్తూ నడుస్తున్నాను.

నా వెనక ఎవరో వస్తున్నట్టుంది. వెనక్కు తిరిగి చూశాను. ఎవరూ లేరు. మళ్ళీ ముందుకు నడుస్తున్నాను. అడుగులో అడుగు వేసుకుంటూ, ఆలోచనలో మరో ఆలోచన గుచ్చుకుంటూ...

నిజం! నా వెనక ఎవరో వస్తున్నారు. నా భుజం తడ్తున్నారు. ప్రేమగా నా వీపు నిమురుతున్నారు. గిలిగింతలు పెట్టేట్టు నా జుట్టు రాస్తున్నారు. చెవిలో గుసగుసగా ఏదో చెప్తున్నారు. ఎవరో తెలియటం లేదు. ఏం చెప్తున్నారో స్పష్టంగా అర్థం కావటం లేదు.

వీథిలో ముందుకు నడుస్తుంటే, అరుగులు, వసారాలు, గుమ్మాలు వెనక్కు వెళ్ళిపోతున్నాయి. అల్లదే! ఆ ఇంటిముందు కల్లాపి చల్లి ముగ్గులు పెట్టి వున్నాయి. అది లక్ష్మివాళ్ళ యిల్లు. చిన్నప్పుడు లక్ష్మి మెరుపు తీగలా, సన్నగా తళుక్కుమంటూ వుండేది. అదేం చిత్రమో! పెదవులెప్పుడూ నవ్వుతూనే వుండేవి. వాకిట్లో కొచ్చి "ఏయ్! కూరలబ్బీ!" అని పిలిస్తే "అయ్యో! నేను కూరలబ్బినైపోతే ఎంత బావుండేది" అనిపించేది. లక్ష్మి పొద్దున్నే ముగ్గులేసే సమయానికి పక్కింటి రామంతో కావాలని కబుర్లకి వెళ్ళేవాణ్ణి. ముగ్గులు పూర్తిచేసి ఇంట్లోకి వెళ్ళే లోపు ఒక్కసారి నా వైపు చూస్తే చాలు. ఓహ్! ఆనందంతో కృష్ణకు పరుగెత్తుకెళ్ళి ఈతలు కొట్టే వాణ్ణి.

ఓసారి మా ఇంటికొచ్చి పువ్వులు కావాలంది. అడిగిందే ఆలస్యం. సన్నజాజి చెట్లన్నీ దులిపి మొగ్గ లేకుండా తుంచుకొచ్చి దోసిళ్ళతో లక్ష్మి కొంగులో పోశాను. చాలీ చాలని పవిట కొంగులో పట్టలేనన్ని సన్నజాజులు గట్టిగా మూట కడితే జాజులు నలిగిపోతాయి. పవిట చాలటం లేదు. పూలు సర్దబోయిన నాకు లక్ష్మి వేళ్ళు తాకాయి. లక్ష్మికి తొట్రుపాటు, చెక్కిళ్ళు సిగ్గుతో కందిపోగా చాలని పవిటని మళ్ళీ మళ్ళీ సర్దుకుంటూ పరుగున వెళ్ళిపోయింది.

అప్పటి నుంచి ఇప్పటి దాకా నా వేళ్ళకి సన్నజాజుల వాసన...లక్ష్మి వాసన...

ఆ పైన లక్ష్మి ఓ కలవారబ్బాయిని చేసుకుంది. పిల్లల్నికంది. నా గురించి ఎప్పుడన్నా అనుకుంటుందేమో తెలియదు గాని నా చేతి వేళ్ళకింకా జాజి, లక్ష్మి వాసన వుంది.

నా వెనక వస్తున్నదీ, గలగల నవ్వుతున్నదీ లక్ష్మే అయ్యుండాలి. కాకపోనూ వచ్చుకూడా.

దీపాల దిన్నె దగ్గర కొచ్చాను. వెనకనుంచి నా తలమీద ఎవరో ఆశీర్వదిస్తున్నట్టుంది. చల్లగా వుంది. హాయిగా వుంది. సర్వాణువులూ కరిగిపోతున్నట్టుంది. ముందుకొచ్చి ఎదురైతే పాదాలపై మోకరిల్లి నన్ను నేను అర్పించుకుందామని వుంది. ఆ స్వామి ముందుకు రాడు. వెనుదిరిగితే అసలు కన్పించడు. ఆయనెవరో? బుద్ధుడా? నాగార్జునుడా? ఆర్యదేవుడా? లేక ఎవరి భిక్షాపాత్ర శకలాలు ఐదో ఆయకస్తంభం కింద నిక్షిప్తమై వుండి తరతరాల మానవాళి పూజలందుకొంటున్న మహనీయుడా? ఎవరు నా వెనక? ఏదో వెలుగు. నా వెనకనున్న వెలుగు, నన్ను వెన్నంటి వున్న వెలుగు. కళ్ళ ముందుకు రావటం లేదు. గిలగిలలాడిపోతూ గుడివైపు నడిచాను.

గాలి గోపురం గూళ్ళలో పావురాళ్ళు కువకువలాడుతున్నాయి. ఉన్నట్టుండి గాలిలోకి ఎగిరి తిరిగి గూళ్ళలోకి వచ్చి ముక్కులు రాసుకుంటున్నాయి. ధ్వజస్తంభం మీద రామచిలుకలు బొమ్మల్లా నుంచుని శిఖరం వైపు చూస్తున్నాయి. ప్రాకారమంతా మారేదు దళాల సుగంధం, జమ్మి ఆకులు గాలికి రాలుతున్నాయి.

గుళ్ళోకి వెళ్తే అమరేశ్వరుడికి హారతి యిస్తున్నారు.

నా వెనక ఎవరో వున్నారు నందీశ్వరుడై వుండాలి.

మళ్ళీ కర్పూర హారతి, లింగాకారం మధ్య ఎర్రటి వెలుగు.

ఎన్ని సంవత్సరాలుగానో కొన్ని వందల కోట్ల హారతులు.

అమ్మకి హారతి కర్పూరపు వెలుగులో మెరుస్తున్న అమ్మ కళ్ళు. గుడినిండా హారతి, గుండె నిండా హారతి, మెట్లు దిగి వస్తుంటే నన్నంటిపెట్టుకుని నా వెనకే వస్తున్న హారతి.

కృష్ణ వొడ్డుకొచ్చాను. కృష్ణగాలి నన్ను కౌగలించుకుంది. ఒంటినిండా అలుముకుంది. ఒళ్ళంతా పులకెత్తించే ఈ యుగ యుగాల కృష్ణగాలి నన్నింత వశీభూతుణ్ణి చేస్తోందేమిటి? ఈ నేల, ఈ మట్టి, ఈ రాయి, ఈ రప్ప, ఈ గాలి, ఈ దుబ్బు, ఈ దిబ్బ నన్ను పిలిచి, పలకరించి మూర్కొని, నన్ను దగ్గరకు తీసుకుని 'నా వూసు చెప్పవా?' అంటున్నావేమిటి? నేనెంతవాణ్ణి? నేనెవర్ని?

నా వెనక ఎవరో నవ్వుతున్నారు?

ఎవరది? నాకు కనబడరేమి? నా ముందుకు రారేమి?

బహుశా వచ్చేవారం నేను రాయబోయే కథ అయి వుండాలి. తెలియదు. నా వెనక ఎవరున్నారో తెలిస్తే, నన్ను నేను తెలుసుకున్నట్లే గదా! అప్పుడు నేనుండనుగా!

ఇది చదివింతర్వాత, ఈ కథ మీ వెన్నంటి నడిస్తే ఈ కథ ఉన్నట్టు...ఓ సన్నజాజి పూచినట్టు.

*